# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● వ్యవసాయ శాఖ ఏడీ హుస్సేన్‌బాబు

శాలిగౌరారం, అక్టోబర్ 30 :ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ హుస్సేన్‌బాబు కోరారు. మండలంలోని పెర్కకొండారం గ్రామంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం సహకారంతో రోహిణి లైన్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని డీడీ వినయ్‌కుమార్, ఎంపీడీఓ రేఖల లక్ష్మయ్యతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని తెచ్చిన వెంటనే తూకం వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రావణ్, డైరెక్టర్ లోకసాని రంగారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



శాలిగౌరారం: పెర్కకొండారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీ హుస్సేన్‌బాబు

## చౌటుప్పల్ మండలంలో..

చౌటుప్పల్ రూరల్ : రైతులు ధాన్యాన్ని శుభ్రపర్చుకుని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పొందాలని తాసీల్దార్ హరికృష్ణ సూచించారు. మండలంలోని పీపల్‌పహడ్, దేవలమ్మ నాగారం, కొయ్యలగూడెం గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. వాతావరణంలో మార్పులు వస్తున్నందున వర్షాల సమయంలో జాగ్రత్తగా ఉండాలని కోరారు. వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి రమేశ్, ఏఈఓ వెంకటేశ్, శ్రావ్య, నవీన్ పాల్గొన్నారు.

## ఆత్మకూరు(ఎం)లో..

ఆత్మకూరు(ఎం): మండలంలోని కూరెళ్ల, లింగరాజ్‌పల్లి, తిమ్మాపురం, రాయిపల్లి, సింగారం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాసీల్దార్ ఆడెపు అండాలు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ యాదగిరి, ఏఈఓలు క్రాంతికుమార్, సరిత, మనీషా, పీఏసీఎస్ సీఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు

## భూదాన్ పోచంపల్లిలో..

భూదాన్ పోచంపల్లి: మండలంలోని జూలూరు, అలీ నగర్, కప్రాయిపల్లి, పెద్ద రావులపల్లి, మామిళ్లగూడెం గ్రామాల్లో జూలూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార శాఖ ఆడిట్ అధికారి పాల్వాయి ప్రవీణ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ రెబ్బాస్ నర్సింహ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నల్లగొండ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

రామగిరి : వానకాలం 2023-24 ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా పౌరసరఫరా అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయంలో గన్నీ బ్యాగుల కొరత ,రవాణా, అన్‌లోడు , తరుగు, చెల్లింపుపై ఎలాంటి సమస్య ఉన్న కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 9963407064 సమాచారం అందించాలన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా సహకార అధికారి ఆర్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఆత్మకూరు(ఎం): కూరెళ్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తాసీల్దార్ ఆండాలు



భూదాన్‌పోచంపల్లి: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రవీణ్ కుమార్



చౌటుప్పల్ రూరల్: దేవలమ్మ నాగారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తాసీల్దార్ హరికృష్ణ

# బీఆర్ఎస్‌తోనే మునుగోడు అభివృద్ధి సాధ్యం

● పార్టీ చండూరు మండలాధ్యక్షుడు వెంకన్న

చండూరు, అక్టోబర్ 30 : మునుగోడు అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ మండలాధ్యక్షుడు బొమ్మర బోయిన వెంకన్న అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రామ శాఖ అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప ఎన్నికల హామీలు నెరవేర్తుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి మరింత వేగంగా ముందుకు పోవాలంటే ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మాదగోని వెంకటేశం, కురుపాటి సుదర్శన్, మహిళ విభాగం మండల ధ్యక్షురాలు పెండ్యాల గీత, కావలి ప్రసాద్, కట్కూరి సత్తయ్య, చంద్రశేఖర్, వెంకన్న, శ్రీను, శ్యామ్ సుందర్, హరినాథ్ రావు, భాస్కర్ రెడ్డి, నర్సిరెడ్డి, లింగస్వామి, శంకర్, యాదయ్య పాల్గొన్నారు.



చండూరు : సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

## శంభులింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

మేళ్లచెర్వు, అక్టోబర్ 30 : స్థానిక స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున స్వయంభువుడికి పంచామృతాభిషేకాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమ పూజల అనంతరం స్వామిని అర్చకులు కొంకపాక శివవిష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ పూలతో విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బందితో పాటు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు నమోదుకు నేడు ఆఖరు

● తాసీల్దార్ ఆంజనేయులు

మునగాల, అక్టోబర్ 30 : వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు నమోదు మంగళవారం చివరి అవకాశమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాసీల్దార్ ఆంజనేయులు కోరారు. తాసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18ఏండ్లు నిండిన వారు ఆన్‌లైన్‌లో ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్ఐ రాధారెడ్డి, సర్వేయర్ సరితారెడ్డి పాల్గొన్నారు.

# రాజగోపాల్ రెడ్డి రాజకీయ సన్యాసం తీసుకోవాలి

● బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లింగంగౌడ్

మర్రిగూడ,అక్టోబర్ 30 : గంటకో మాట పూటకో పార్టీ మారే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజకీయ సన్యాసం తీసుకొని మునుగోడు ఉప ఎన్నికలో ఆయన చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ చెర్కు లింగం గౌడ్ హితవు పలికారు. శివన్నగూడెంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డబ్బులతో ఓట్ల కొని గెలుస్తాననే అహంకారంతో ఉన్న రాజగోపాల్ రెడ్డి ఈ సారి ఎన్నికల్లో ప్రజలు కచ్చితంగా ఓడించి బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా నాలుగేండ్లుగా ఉంచి అభివృద్ధి నిరోధకుడిగా మారిన కాంగ్రెస్ అభ్యర్థి ఇప్పుడు గెలిచి ఏం చేస్తాడో ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్రంలో మూడోసారి కూడా గులాబీ జెండానే ఎగురుతుందని సర్వేలు చెబుతున్నాయని ఇక్కడ కూడా బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలిస్తేనే అభివృద్ధి నిరాటంకంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## విశ్వబ్రాహ్మణ మహాసభను విజయవంతం చేయాలి

బొడ్రాయిబజార్, అక్టోబర్ 30: రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం ఆధ్వర్యంలో నవంబర్ 5న హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మహాజన సభను విజయవంతం చేయాలని తెలంగాణ విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం జిల్లా అధ్యక్షులు పోతుగంటి వీరాచారి పిలుపునిచ్చారు. సోమవారం సంఘం కార్యాలయంలో సభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కట్టోజు గోపి, పట్టణ అధ్యక్షులు కడవెండి సతీశ్, జనగాం వీరాచారి, ఆయా మండలాల అధ్యక్షులు బెజ్జంకి ఉపేంద్రచారి, సీతారామాచారి, పోలోజు వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

మర్రిగూడ,అక్టోబర్ 30 :దామెరభీమనపల్లి గ్రామానికి చెందిన శిలువేరు యాదయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. జడ్పీటీసీ పాశం సురేందర్ రెడ్డి రూ.10వేలు పంపగా సోమవారం ఎంపీటీసీ శిలువేరు విష్ణు బాధితుడిని పరామర్శించి ఆయనకు అందజేశారు. ఆయన వెంట వస్పరి సంజయ్, శ్రీశైలం, శ్రీకాంత్ ఉన్నారు.

## రేపు ఓటరు అవగాహన సదస్సు

రామగిరి, అక్టోబర్ 30: ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండలో ఓటర్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి సోమ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శివాజీనగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు విశ్రాంత ఐఏఎస్ పద్మనాభ రెడ్డి, విశ్రాంత ఐఎస్ఎస్ చొల్లేటి ప్రభాకర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

# సరిహద్దుల్లో నిఘా కట్టుదిట్టం

- 24గంటల పాటు వాహన తనిఖీలు
- చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు
- కలెక్టరేట్‌లో కెమెరాల మానిటరింగ్



సూర్యాపేట కలెక్టరేట్‌లో సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్న సిబ్బంది

సూర్యాపేట, అక్టోబర్ 30: ఎన్నికల వేళ అక్రమాలు జరగ కుండా అధికారులు సరిహద్దుల్లో నిఘా కట్టుదిట్టం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు నగదు, వస్తువులు, మద్యం, ఇలా ప్రలోభాలకు గురిచేసే ఏ వస్తువు రా కుండా సరిహద్దులలో చెక్ పోస్టులను ఏర్పాటుచేశారు. చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని కలెక్టరేట్‌లో మానిట రింగ్ చేస్తున్నారు.

## తనిఖీలు ముమ్మరం

ఎన్నికల సమీపిస్తుండటంతో ఎన్నికల అధికారులు జిల్లాలో 24గంటల పాటు తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లా సరిహద్దుల నుంచి వస్తున్న అక్రమ నగదు, మద్యం, వస్తువులను అడ్డుకునేందుకు జిల్లా అధికారులు ఏడు అంతరాష్ట్ర సరిహద్దులు, ఎనిమిది అంతర‌జిల్లా సరిహద్దులను ఏ ర్పాటుచేసి నిరంతరం తనిఖీలు చేపడుతున్నారు. అనుమతు లేకుండా జిల్లాలోకి వస్తున్న నగదు, బంగారం, మద్యం, ఇతర వస్తువులు సీజ్‌చేసి జిల్లా అధికారులకు అప్పగిస్తున్నారు. ప్రతి చెక్ పోస్టు వద్ద రెండు చొప్పున సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. వాహనం తనిఖీచేసే విధానం రికార్డు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## 15 చెక్ పోస్టులు

సూర్యాపేట జిల్లాకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సరిహద్దుతో పాటు నల్గొండ, జనగాం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలు సరిహద్దులు. ఈ ప్రాంతాలకు రాకపోకలు జరిపే 15 ప్రాంతాలను గుర్తించిన అధికారులు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. అంతర్రాష్ట్ర చెక్ పోస్టులైన చింత్రియాల, మఠంపల్లి, మహంకాళిగూడెం, పులిచింతల‌ప్రాజెక్ట్, బుగ్గమాదారం, దొండపహాడ్, రాంపురం ఎక్స్ రోడ్డు. అంతర్‌జిల్లా చెక్ పోస్టులు మామిళ్లగూడెం, శాంతినగర్, టేకుమట్ల, బీమారం, కుంటపల్లి, తిరుమలగిరి, వెలిశాల ఎక్స్ రోడ్డు, జూపాడుల వద్ద ఈ చెక్ పోస్టులను ఏర్పాటుచేశారు. ఒక్కొక్క చెక్ పోస్టు వద్ద 2 సీసీ కెమెరాల చొప్పున 30 సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నారు. చేశారు. వాటి లింక్‌లను కలెక్టరేట్‌లోని ఐటీ వింగ్ రూంకు కనెక్ట్ చేసి మానిటరింగ్ చేస్తున్నారు. చెక్ పోస్టుల వద్ద 24 గంటల పాటు తనిఖీ చేసేలా సిబ్బందిని నియమించారు.

## ఇప్పటివరకు 1.05కోట్లు స్వాధీనం

ఎన్నికల కోడ్ అమలైనప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు చెక్ పోస్టుల వద్ద రూ. 1.05కోట్లు నగదు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మఠంపల్లి చెక్ పోస్టు వద్ద రూ.13,03,000 నగదు పట్టుబడగా పులిచింతల ప్రాజెక్ట్ చెక్ పోస్టు వద్ద రూ. 4,74,500 నగదు ,దొండ పహాడ్ వద్ద రూ. 2,00,000నగదు రాంపురం ఎక్స్ రోడ్డు వద్ద నగదు, ఇతర వస్తువులు కలిపి దాదాపు 86,12,868పట్టుబడినట్లు అధికారులు చెప్పారు.